

# మన బడి

## మాస పత్రిక



సంపుటి: 1 సంచిక: 2 జనవరి – 2025 పేజీలు: 24




## సనత్ సంకల్పం ఆకాశమంత

# గూగుల్ ఛాంపియన్ సఫారు సనత్ కుమార్




మెగా పేరెంట్స్ మీటింగ్ అదరహో



'సమగ్ర శిక్షా'కు జాతీయ అవార్డు



పాఠశాలలను సందర్శించిన ప్రపంచబ్యాంకు ప్రతినిధులు




# మనబడి

## మాస పత్రికను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి

పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో రూపొందించిన 'మనబడి' మాసపత్రికను బాపట్లలో 7.12.2024న నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆవిష్కరించారు. మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్, ఎంపీ టి కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్ర వర్మ, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు, సమగ్ర శిక్షా పథక రాష్ట్ర సంచాలకులు బి శ్రీనివాసరావు, బాపట్ల కలెక్టర్ వెంకట మురళి, విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్లు ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మన బడి

## మాస పత్రిక

సంపుటి: 1 సంచిక: 2 జనవరి– 2025 పేజీలు: 24

**గౌరవ సలహాదారులు**
**కోన శశిధర్,** ఐ.ఎ.ఎస్.,
సెక్రటరీ, పాఠశాల విద్యాశాఖ
**విజయరామరాజు.వి,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ
**డా. కృతికా శుక్లా,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, ఇంటర్మీడియెట్ విద్య

**ఎడిటర్**
**బి.శ్రీనివాసరావు,** ఐ.ఎ.ఎస్.,
స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్షా

**సలహాసభ్యులు**
**వి.ఎన్.మస్తానయ్య**, డైరెక్టర్, SIEMAT
**ఎం.ఆర్.ప్రసన్నకుమార్,** ASPD –1
**డి.దేవానందరెడ్డి,** సెక్రటరీ, KGBV
**డి.మధుసూదనరావు,** డైరెక్టర్, AP Text Books Press
**కె.నాగేశ్వరరావు,** అడిషనల్ డైరెక్టర్, SAMO
**కె.రవీంద్రనాథ్ రెడ్డి,** ASPD –2
**వి.మనోహర్ నాయక్,** CMO
**కె.జీవనజ్యోతి,** సూపరింటెండెంట్, CMO

**వర్కింగ్ ఎడిటర్**
**చల్ల మధుసూదనరావు,** మీడియా కన్సల్టెంట్

**సబ్ ఎడిటర్**
**గణేశ్ బెహరా,** PRO

**ఎడిటోరియల్ కమిటీ**
**డా. ఎస్.వి. లక్ష్మణరావు,** టీఎస్‌జీ (సీఎంవో)
**పైడి.వెంకట రమణ,** సీనియర్ ప్రోగ్రామర్
**డా. కె.శారద,** శామో ఫ్యాకల్టీ
**డా. ఎ.సుహాసిని,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. వి.సతీష్ రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. ఎస్.ప్రసాద్ రావు,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**జి. మహేశ్వర రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. టి.ఇస్మాయిల్,** దీక్ష కో ఆర్డినేటర్
**డా. కె.పెంచలయ్య,** టీఎస్‌జీ (ఆర్టీఈ)
**డా. వై.నరసింహం,** టీఎస్‌జీ(ఐఈ)
**పి.వేంకటేశ్వరరావు,** టీఎస్‌జీ (ప్లానింగ్)
**పి.గీత,** టీఎస్‌జీ(ఓఎస్‌సీ)

**డిజైనింగ్**
**గిరిధర్ అరసవల్లి**

**డీటీపీ & సహకారం**
**కె.అభిషేక్**

**చిత్రకారులు**
**మల్లిక్ & లక్ష్మణ్**

## సంపాదకుల మాట

పాత సంవత్సరం వెళ్లిపోయింది. వీడ్కోలు చెప్పేసారా?
కొత్త సంవత్సరం వచ్చేసింది. స్వాగతం పలికేశారా?
ఒక ఏడాది గడిచిపోయిందంటే, అది ఒక అనుభవం, గుణపాఠం.

ఏం చేయాలి? ఏం చేయకూడదు? పొరపాట్లు ఎలా జరిగాయి? అని సమీక్షించుకునే సందర్భం.
ప్రయత్నమే తొలి విజయం అంటారు. అసలు ప్రయత్నమే చేయకపోతే ఫలితం ఎలా వస్తుంది?
గత ఏడాది పరీక్షలలో మార్కులు రాలేదా? కారణాలు ఏంటో తెలుసుకుని సరిదిద్దుకుంటే,
ఈ ఏడాది మార్కులు వస్తాయి..

బడిలో మీరు వెనకబడ్డారా? చదువులోనా? ఆటల్లోనా? పాటల్లోనా?
మీరు వెనకబడ్డారు అంటేనే, పోటీలో ముందున్నారని అర్థం..
బోలెడు రేటు పెట్టి సీటు కొని కార్పొరేటు స్కూళ్లలో
చదివే వారు మీకంటే ఏం ఎక్కువ?
మన ప్రభుత్వ యాజమాన్యంలో 45087 స్కూళ్లున్నాయి.
లక్షలాది మంది ఉపాధ్యాయులు 35 లక్షలకు పైగా విద్యార్థులకు
నాణ్యమైన విద్యను అందిస్తున్నారు.

డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పదార్థాలను ప్రాంతాలవారీ
ఆహారపు అలవాట్లను గౌరవిస్తూ మార్పులు చేశాం.

అన్నపూర్ణ మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎటుచూసినా సస్యశ్యామలమైన
పచ్చని పొలాలను తలపించే రంగులను పోలిన ఏకరూప దుస్తులు అందించనున్నాం.
హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందించాం.

పాడిపంటలు తులతూగే వేళ..ప్రతీ ఇంటా సంక్రాంతి కాంతులు వెల్లి విరిసే ఆనంద హేలలో
కొత్త సంవత్సరం, విద్యా సంక్రాంతికి స్వాగతం పలుకుదాం..

పాఠశాలల్లో విద్యాసేద్యంతో తరగని నిధియైన విద్యా విజ్ఞాన పంటలు పండిద్దాం.
భావిభారతాన్ని సుసంపన్నం చేద్దాం...

– **బి శ్రీనివాసరావు,** IAS
ఎడిటర్ & రాష్ట్ర పథక సంచాలకులు
సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed at **M/s. Lakshmi Vignesh Printers,** Guntur
ఆన్ లైన్ మ్యాగజైన్ కోసం: https://schooledu.ap.gov.in/samagrashiksha/ మరియు cse.ap.gov.in

కవర్ స్టోరీ



# సహిత విద్యతో భవిత

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రతి ఏటా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. దివ్యాంగ విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించడానికి 2025 నాటికి రాష్ట్రంలో ఉన్న పాఠశాలలను ఇన్‌క్లూజివ్ పాఠశాలలుగా అప్ గ్రేడ్ చేయాలనే ఉద్దేశంతో సహిత విద్యతో భవితకు మార్గం చూపుతోంది సమగ్ర శిక్షా.

- ★ ప్రతి సంవత్సరం బడి బయట ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించడానికి సర్వే నిర్వహిస్తారు. ఈ సర్వే ద్వారా 0 నుండి 18 సంవత్సరాల వయస్సు గల బడి బయట ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారిని దగ్గర్లోని ప్రభుత్వ పాఠశాలలో నమోదు చేస్తున్నారు.
- ★ గుర్తించిన 0-18 సంవత్సరాల వయస్సు గల దివ్యాంగ పిల్లలకు వారి అవసరాలకు అనుగుణంగా భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ద్వారా ప్రత్యేక విద్య, ఫిజియోథెరపి, స్పీచ్ థెరపి, పూర్వ ప్రాథమిక విద్యను ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా బోధిస్తారు.
- ★ తీవ్ర, అతి తీవ్ర వైకల్యం కలిగి పాఠశాలకు హాజరు కాలేని పిల్లలకు ప్రతి శనివారం వారి ఇంటి వద్దకు వెళ్లి అక్కడే వారికి గృహ ఆధారిత విద్యను అందజేస్తున్నారు.
- ★ ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో వైకల్యాన్ని అంచనా వేసి, దాని తీవ్రతను గుర్తించి వారికి సరియైన ఉపకరణాలను అందించడానికి నిష్ణాతులైన ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో మండల స్థాయిలో వైద్య నిర్ధారణ క్యాంపులు (Medical Assessment Camps) నిర్వహించడం, వారికి కృత్రిమ అవయవాల తయారీ సంస్థ (ALIMCO) ద్వారా వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్ళు, వీల్ ఛైర్లు, రోలేటర్లు వంటి ఉపకరణాలను ఉచితంగా విద్యార్థులకు అందజేస్తున్నారు.

## మరిన్ని కార్యక్రమాలు

- ★ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ సహకారంతో గ్రహణం మొర్రి, గ్రహణ శూల విద్యార్థులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించడం.



★ భవిత కేంద్రాలకు హాజరవుతున్న విద్యార్థులకు ఫిజియోథెరపీ సేవలు అందించడానికి ఫిజియోథెరపీ ఉపకరణాలు, ఉన్నత పాఠశాలల్లోని ప్రత్యేక అవసరాలు విద్యార్థులకు బోధనోపకరణాలు (TLM) అందజేయడం.
★ సహిత విద్యా రిసోర్స్ పర్సన్లకు, స్పెషల్ ఉపాధ్యాయులకు వృత్త్యంతర శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం.
★ సమ్మిళిత విద్య, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల పట్ల అవగాహన కోసం తల్లిదండ్రులు, NGO లు, హెడ్మాస్టర్లు, DIET కళాశాల ప్రిన్సిపాళ్ళు, మండల విద్యా శాఖాధికారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం.
★ సమ్మిళిత విద్య ప్రాముఖ్యతను తెలియజేసే ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం, బ్రెయిలీ దినోత్సవం, వరల్డ్ ఆటిజం డే, ఫిజియోథెరపీ డే వంటి కార్యక్రమాలు నిర్వహించడం.
★ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు స్పోర్ట్స్ మరియు Exposure Visits నిర్వహించుట.
★ ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల నమోదును పెంచడానికి, వారి తల్లిదండ్రులకు ఆర్థికంగా చేయూతనందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు వివిధ రకాల భత్యాలను (అలవెన్సులు) అందించడం.
★ ఎస్కార్ట్ అలవెన్స్
★ రవాణా భత్యం
★ గృహ ఆధారిత భత్యం
★ గర్ల్ స్టయిపెండ్
★ రీడర్ భత్యం.

## ఇన్‌క్లూసివ్ ఆంధ్ర - విజన్ 2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించి 2025 నాటికి ఇన్‌క్లూజివ్ పాఠశాలలుగా అప్ గ్రేడ్ చేయాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. ప్రతి జిల్లా నుండి పదిమంది ప్రత్యేక ఉపాధ్యాయులను కీ రిసోర్స్ పర్సన్లుగా ఎంపిక చేసి వారికి ఈ డిజిటల్ నైపుణ్యాలతో పాటు అసిస్టివ్ టెక్నాలజీస్ పై ఐదు రోజులు శిక్షణ ఇచ్చారు ప్రత్యేక ఉపాధ్యాయులు, దివ్యాంగ విద్యార్థులకు ట్యాబులను పంపిణీ చేశారు. ఈ ట్యాబుల వినియోగంపై సహిత విద్యా రిసోర్స్ పర్సన్లకు జిల్లా స్థాయిలో ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు.

## దివ్యాంగులకు డిజిటల్ విద్య

దివ్యాంగ విద్యార్థులకు తమ దైనందిన జీవితంలో ఎవరి సహాయం లేకుండా తమ పనులు తాము స్వయంగా చేసుకునేలా ఈ ట్యాబుల్లో 33 రకాల యాప్ లను ఇన్ స్టాల్ చేశారు. వాటిని ప్రత్యేక ఉపాధ్యాయులు బోధిస్తున్నారు.

దృష్టిలోపం, వినికిడిలోపం, బుద్ధిమాంద్యత, ఆటిజం, సెరిబ్రల్ పాల్సీ, డౌన్ సిండ్రోమ్, అభ్యసనా వైకల్యం ఉన్న విద్యార్థులకు ఈ యాప్ లను ఉపయోగించి సులభంగా బోధించడం వల్ల వారి అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించవచ్చు.



ఈ ట్యాబ్ లో ప్రత్యేకంగా పిల్లవాడికి చైల్డ్ ఐడి క్రియేట్ చేసి, ఉపాధ్యాయుల ట్యాబ్లో ఫ్యామిలీ లింకు యాప్ కు పిల్లవాడి ఐడీని లింక్ చేయడం వల్ల దివ్యాంగ విద్యార్థి ట్యాబ్ లో యాప్స్ ఉపయోగించిన సమయం, విద్యార్థి లొకేషన్, తదితర అంశాలను 'ఫ్యామిలీ లింక్ యాప్' ద్వారా ప్రత్యేక ఉపాధ్యాయుడు పర్యవేక్షిస్తారు. తద్వారా జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు ఆన్లైన్ లో సులభంగా మానిటరింగ్ చేయవచ్చు.

## గూగుల్ లుక్ అవుట్ యాప్

ఈ యాప్ ను ఉపయోగించి పాక్షిక దృష్టిలోపం, పూర్తి అంధత్వం కలిగిన దివ్యాంగ విద్యార్థులు తమ దైనందిన జీవితంలో ఎవరి సహాయం లేకుండా తమ పనులు తాము స్వతంత్రంగా చేసుకోగలుగుతారు.

ఈ యాప్ లో ఉన్న ఆరు రకాల ఫీచర్స్ ద్వారా దృష్టి లోపం గల పిల్లలు చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాల్లో ఉన్న వస్తువును గుర్తించి విద్యార్థికి ఆడియో రూపంలో తెలియజేస్తుంది.

అలాగే పుస్తకాల్లో ఉన్న పదాలు, వాక్యాలను చదివి ఆడియో రూపంలో దృష్టిలోపం గల విద్యార్థికి తెలియజేస్తుంది.

కరెన్సీను గుర్తించి పిల్లవాడికి తెలియజేస్తుంది. దీనివల్ల పిల్లవాడు వస్తువులను, వ్యక్తులను గుర్తించడం, సంఘటన యొక్క వివరణాత్మక విషయాలను తెలుసుకోవచ్చు.

## కవి పిటిఎస్:

ఈ యాప్ భాషా సంబంధమైన సమస్యలు, ఆటిజం, బుద్ధిమాంద్యత, సెరిబ్రల్ పాల్సీ, దృష్టిలోపం, డౌన్ సింబ్రోమ్, అభ్యసనా వైకల్యం గల పిల్లలకు బోధనోపకరణ సామగ్రిలా చిత్రాన్ని చూపిస్తూ ఆడియో రూపంలో పిల్లవాడికి తెలియజేస్తుంది. పిల్లవాడికి నిజరూప చిత్రాలను కూడా చూపించి పిల్లవాడిలో సాంఘిక, జ్ఞానాత్మక నైపుణ్యాలను పెంపొందించవచ్చు. ఈ కవి పిటిఎస్ యాప్ ద్వారా ప్రతి విషయాన్ని పిల్లవాడికి సులభంగా అర్థమయ్యేలా బోధించవచ్చు.ఈ యాప్ ద్వారా భాషా సంబంధ సమస్యలు ఉన్న దివ్యాంగ విద్యార్థికి స్పీచ్ థెరపీ ఇచ్చి మాటలను నేర్పించవచ్చు.

జెల్లో కమ్యూనికేషన్, ఆవాజ్ యాప్ లను ఉపయోగించి అన్ని రకాల వైకల్యాలు గల పిల్లలకు సులభంగా బోధించేందుకు, వారిలో బోధనా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపయోగపడుతుంది.

## లైవ్ ట్రాన్ స్క్రైబ్ :



ఈ యాప్ వినికిడి సామర్థ్యం తక్కువగా గలవారికి, బధిరులకు సహాయపడే యాప్.

ఈ యాప్ ద్వారా వ్యక్తి మాట్లాడే మాటలు స్పష్టంగా ట్యాబ్ డిస్ ప్లే పై ప్రదర్శితమవుతుంది.

ఇది అన్ని ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉంది.

ఉపాధ్యాయుడు పాఠం చెబుతూ ఉంటే వినికిడి లోపం గల విద్యార్థికి అక్షర రూపంలో ప్రదర్శితమవుతుంది.

అలాగే విద్యార్థి ఏవైనా ప్రశ్నలు అడగాలనుకున్నప్పుడు డిస్ ప్లే మీద అక్షరాల రూపంలో టైప్ చేస్తూ తెలియజేయడానికి అవకాశం ఉంటుంది. ఉత్తర ప్రత్యుత్తరాలు ఇవ్వలేని విద్యార్థులు వారి జవాబును టైప్ చేసి చూపించే వెసులుబాటు ఉంది.ఈ యాప్ వినికిడి లోపం గల దివ్యాంగ విద్యార్థికి చాలా బాగా ఉపయోగపడుతుంది.





# సనత్ సంకల్పం ఆకాశమంత

* గ్రోత్ హార్మోన్ డెఫిషియన్సీ విద్యార్థికి సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో డిజిటల్ మార్గదర్శనం
* గూగుల్ స్టూడెంట్ ఛాంపియన్ 2024గా నిలిచి డిజిటల్ రంగంలో సఫారు సనత్ కుమార్ రికార్డు










## పిల్లలూ.. మీలో ఒక పిల్లాడు సనత్ కష్టం మీకు తెలుసా?

అనంతపురం జిల్లా నుంచి ఆకాశమంత ఎదిగిన సనత్ సంకల్పం తెలుసుకుందామా?

క్లాసులు మారినా సనత్ శరీరంలో మార్పులేదు..

గ్రోత్ హార్మోన్ డెఫిషియెన్సీ ఒకటో తరగతి పిల్లాడిలానే ఉంచేసింది..

తల్లిదండ్రులకు గుబులు.. అబ్బాయిలో దిగులు..

హార్మోన్ తగ్గుదల మనిషిని ఎదగనీయకుండా అడ్డుకుంది కానీ సనత్ ఆకాశమంత ఆత్మవిశ్వాసాన్ని అడ్డుకోలేకపోయింది..

పెనమలూరు పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న సఫారు సనత్ కుమార్ 2024 గూగుల్ చాంపియన్షిప్ అవార్డును గెలుచుకుని డిజిటల్ రంగంలో సఫారు చరిత్ర సృష్టించాడు.

## అనంతపురం నుంచే ఆరంభం

అనంతపురం జిల్లాలో సఫారు లక్ష్మీప్రసాద్, పల్లవి దంపతులకు ఇద్దరు పిల్లలు. పెద్దాడు సనత్ కుమార్, చిన్నోడు హరిషిత్ కుమార్. తండ్రి వంట పని చేస్తారు. పిల్లలు ఇద్దరూ గ్రోత్ హార్మోన్ డెఫిషియెన్సీతో పుట్టారు.








## మార్గం చూపిన డిజిటల్ పాఠశాల

వయస్సుకి తగ్గట్టు శారీరక ఎదుగుదల లేకపోవడంతో మనస్సు విద్య వైపు ఎంతగా ఆసక్తి చూపుతున్నా.. పుస్తకాల బరువు శరీరానికి భారమైంది. సమగ్రశిక్షా ఆధ్వర్యంలో ఇన్ క్లూజివ్ ఎడ్యుకేషన్ విభాగం సఫారు సనత్ కుమార్ కు డిజిటల్ మార్గదర్శనం చేయడంతో ఇప్పుడు ప్రపంచానికే మార్గదర్శకుడిగా మారాడు. సవాళ్లను సృజనాత్మకంగా ఎదుర్కొని తన ప్రత్యేకతలను ఒక శక్తిగా మార్చుకున్నాడు. పుస్తకాలలో భాషలు చదవకుండానే కోడింగ్ భాషలను నేర్చుకున్నాడు. పుస్తకాలు, పెన్నులు స్థానంలో డిజిటల్ సాధనాలు, యాక్సెసిబిలిటీ ఫీచర్స్ సనత్ కి సరికొత్త పాఠశాలలో చేర్చాయి. 8వ తరగతి నుంచి డిజిటల్ ట్యాబ్ ద్వారా చదువుకోవడం మొదలు పెట్టాడు. సనత్ మేధస్సు కేవలం పాఠ్యాంశాల్లో కాకుండా, టెక్నాలజీ, గూగుల్ ఫీచర్స్ లోనూ వికసించింది. గూగుల్ లో యాక్సెసిబిలిటీ ఫీచర్స్ ను పరీక్షించాడు, ఆ ఫీచర్లు ప్రత్యేక అవసరాల పిల్లలకు ఎలా ఉపయోగపడతాయో తెలుసుకున్నాడు. **"నేను లిమిటెడ్ ఎడిషన్"** అని సగర్వంగా చాటిచెప్పే సనత్ డిజిటల్ అభ్యసనా చరిత్రలో తనకంటూ ఒక పేజీ లిఖించుకున్నాడు.

## ప్రతిభకు అరుదైన గుర్తింపు

డిసెంబర్ 12, 2024న, ఢిల్లీలోని గూగుల్ కార్యాలయంలో, గూగుల్ ఎడ్యుకేషన్ హెడ్ సంజయ్ జైన్ నుండి సఫారు సనత్ కుమార్ గూగుల్ ఛాంపియన్ అవార్డు అందుకున్నాడు. ఈ సందర్భంగా, అతను గూగుల్ క్రోమ్‌బుక్ యొక్క ప్రత్యేకమైన యాక్సెసిబిలిటీ ఫీచర్లు, క్రోమ్‌బాక్స్, స్క్రీన్ రీడర్, గూగుల్ ట్రాన్ స్క్రైబ్, గూగుల్ ట్రాన్స్లేట్ వంటి టూల్స్ ఉపయోగం గురించి, అవి ప్రత్యేక అవసరాల పిల్లలకు ఏ విధంగా ఉపయోగపడతాయో వివరించాడు.

## సనత్ విజయాలు

* సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో బహుమతి
* కేరళలో గ్లోబల్ ఇండియా స్టూడెంట్ డిజిటల్ ఫెస్టివల్‌లో పార్టిసిపేషన్
* గూగుల్ ఛాంపియన్షిప్ అవార్డు 2024

## సనత్ మార్గదర్శి రామ్ కమల్

సమగ్ర శిక్షాలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ అడ్వైజర్ రామ్ కమల్ సనత్‌కు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి అతనిలో ఉన్న ప్రతిభను వెలుగులోకి తెచ్చారు. సనత్ విజయగాథ ప్రత్యేక అవసరాల విద్యార్థుల ఆత్మవిశ్వాసానికి ఓ స్ఫూర్తి అంటారు గురువు రామ్ కమల్.

**– అమలాపురం దుర్గా ప్రసాద్,**
కంటెంట్ రైటర్

**వై.నరసింహం,**
కన్సల్టెంట్, ఐఈ విభాగం



## శెహభాష్.. సనత్..

అభినందించిన మానవ వనరుల శాఖ మంత్రి **నారా లోకేష్**

గూగుల్ ఛాంపియన్ అవార్డుకి ఎంపికైన సఫారు సనత్ కుమార్‌ని ట్విట్టర్ ద్వారా అభినందించిన మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్.. సనత్‌ని త్వరలోనే కలుస్తానని ప్రకటించారు. తనను తాను లిమిటెడ్ ఎడిషన్ అని ఆత్మవిశ్వాసంతో ప్రకటించిన సనత్‌ని ఇటీవలే మంత్రి కలిశారు. సాధించిన విజయాలు తెలుసుకుని శెహభాష్ సనత్ అని అభినందించారు.

# ఆంధ్రప్రదేశ్ **సమగ్ర శిక్షా** కు జాతీయ అవార్డు




'దివ్యాంగుల హక్కుల చట్టం, దివ్యాంగుల కోసం ఇతర పథకాల అమలులో ఉత్తమ రాష్ట్రం'గా ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షాకు జాతీయ స్థాయి అవార్డు వరించింది. ఈ అవార్డును గౌరవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారి చేతుల మీదుగా సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు IAS అందుకున్నారు.

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దిల్లీలో 03.12.2024న భారత ప్రభుత్వ సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ &దివ్యాంగ సాధికారత విభాగం (దివ్యాంగ జన్) ఆధ్వర్యంలో జరిగిన 'నేషనల్ అవార్డ్స్ ఫర్ ది ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసేబిలిటీస్ 2024' కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బెస్ట్ స్టేట్ ఇన్ ఇంప్లిమెంటింగ్ ది రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసేబిలిటీస్ యాక్ట్ అవార్డును సాధించింది. ఈ కీర్తిని సాధించడంలో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా దిశానిర్దేశంలో సహిత విద్యా విభాగం ప్రముఖ పాత్ర పోషించింది.

## ఉన్నతాధికారుల ప్రశంసలు

ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ IAS , పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు. వి. IAS, సమగ్రశిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు IAS , సహిత విద్యావిభాగానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.




## అవార్డు వెనుక ఎంతో కృషి...

* ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా దివ్యాంగులకు సరైన విద్యా అవకాశాలు అందించడంలో ముందంజలో ఉంది. ఇందులో భాగంగా దివ్యాంగ విద్యార్థులకు డిజిటల్ విద్యా విధానం, ఇంటర్నెట్ ఆధారిత టూల్స్ ద్వారా సమానమైన విద్యా అవకాశాలను అందించడం ద్వారా గ్లోబల్ స్థాయిలో ప్రశంసలు పొందింది.
* ఇన్ క్లూజివ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా ఉత్సవాలు విజయవంతమయ్యాయి. ఈ కార్యక్రమాలు, దివ్యాంగుల సామాజిక హక్కుల పట్ల అవగాహన పెంచడం, వారి సాధికారతను పెంపొందించడం వంటి ముఖ్యమైన అంశాలపై దృష్టి పెట్టాయి.





MPTM

# మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ రికార్డ్



ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించడం ద్వారా ఏపీ సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రభుత్వ విద్యా వ్యవస్థకు దిశానిర్దేశం చేసేలా 45087 పాఠశాలల్లో జరిగిన మెగా పీటీఎంలో 25,46,725 తల్లిదండ్రులు, 1,88,537 ఉపాధ్యాయులు, 30,34,577 విద్యార్థులు, 3,44,831 పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, దాతలు పాల్గొన్నారు.

























# విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను బోధించాలి

**వి**విధ రకాల దేశాల స్వభావం వివిధ రకాలుగా ఉంటుంది. ఈ విధంగానే భారత స్వభావం 'ఆధ్యాత్మికత' అందుకనే మన విద్య విలువలతో కూడి ఉంటుంది. ఎంత పెద్ద దేశమైనా సాంకేతికంగా అభివృద్ధి చెందినప్పటికీ అక్కడ విలువలు లోపించినట్లయితే ఆ దేశానికి పతనం తప్పదు. ప్రపంచంలోనే అతిపెద్ద విశ్వవిద్యాలయమైన తక్షశిల మన అఖండ భారతంలోనే ఉండేది. ఎన్నో దేశాల నుండి అభ్యసించడానికి విద్యార్థులు వచ్చి ఇక్కడ విలువలతో కూడిన విద్యను అభ్యసించిన సందర్భాలు ఉన్నాయి. మన దేశ గురువులకు ఉన్న ప్రత్యేకత ఇది.

నేడు మన సమాజంలోని విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించ లేకపోతే రాబోవు సమాజం అతిపెద్ద ఉపద్రవాన్ని ఎదుర్కొంటుందని నేడు మేధావులు గ్రహిస్తున్నారు. నేడు సమాజంలో అన్ని రంగాలలో విలువలు పతనం అవుతున్నాయి. ఇవి కేవలం వ్యక్తులలో వచ్చిన మార్పుల వలన జరుగుతుంది. ఒక వ్యక్తి నుండి ప్రారంభమయ్యే మార్పు అతని ఆలోచనల నుండే ప్రారంభమవుతుంది. ఆ ఆలోచన ఆచరణగా మారుతుంది, ఆచరణ అలవాటుగా, అలవాటు స్వభావంగా, ఆ స్వభావమే వ్యక్తిత్వం. ఆ విలువలతో కూడిన వ్యక్తిత్వమును బోధించడానికి గురువులు మార్గదర్శకులుగా ఉంటారు. గురువులు ఈ విలువలను బోధన ద్వారా మాత్రమే నేర్పించగలరు.




విద్యా ప్రధాన లక్ష్యం 'విలువలను బోధించడమే' కానీ ఇది అర్థం చేసుకోలేని తల్లిదండ్రులు గురువుల దగ్గరకు వచ్చి మార్కులు, ర్యాంకులు మాత్రమే అడుగుతున్నారు. ఏ ఒక్క తల్లిదండ్రులు కూడా మా పిల్లలకు విలువలు నేర్పించండి సంస్కారం నేర్పించండి అని అడగటం లేదు. 'సంస్కారం అభావేనాసాక్షారోరాక్షసోభవేత్' అంటే సంస్కారం లేని అక్షరాస్యుడు, రాక్షసునితో సమానం.

అమెరికా అధ్యక్షుడు అయిన అబ్రహం లింకన్ తన బిడ్డలకు కష్టపడే తత్వం నేర్పించమని గురువులను కోరాడే గాని... మార్కులను కాదు. తల్లిదండ్రులు విద్యార్థులకు కష్టపడే విధానం నేర్పించక నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులను పోటీలో నిలబెట్టకుండా తల్లిదండ్రులే పిల్లలను భుజాలపై మోస్తూ పరిగెత్తుతున్నారు. దీనివల్ల పిల్లలు స్వశక్తిపై కాకుండా తల్లిదండ్రులపై ఆధారపడే విధంగా తయారయ్యే ప్రమాదం ఉంది. ఇలాంటి ప్రమాదకరమైన పరిస్థితులు రాకుండా, సమాజం పతనం చెందకుండా తల్లిదండ్రుల సమావేశాలలో 'విలువల విద్యను' ఉపాధ్యాయులే బోధించాల్సిన అవసరం ఉంది. ఈ మధ్య జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలలో రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా ఉపాధ్యాయులు చాలా స్వేచ్ఛాయుత వాతావరణంలో తల్లిదండ్రులతో పూర్తిస్థాయిలో మమేకమై కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే కాక పిల్లల గురించి వివరించగలిగారు. రాబోయే రోజులలో పిల్లల పెంపకం విషయంలో తల్లిదండ్రులలో మార్పును ఆశిద్దాం..



**– వి.వి.రమణ నాయక్.**
ఉపాధ్యాయుడు
ఎంపీపీ స్కూల్, PS తండా.
కారంపూడి.
పల్నాడు జిల్లా.



# విహార యాత్రలు .. విజ్ఞాన మార్గాలు..



విజ్ఞాన యాత్రలను ప్రోత్సహించాలి. అయితే అవి కేవలం సందర్శన స్థలాలను చూపించే ప్రక్రియగా మారకుండా వాటిని ఉపయోగపడేలా చూసే బాధ్యత టీచర్లదే! చూసిన స్థలాలను చక్కగా డైరీ రాయమని పిల్లలకు చెప్పాలి. బాగా రాసిన వారిని మెచ్చుకోవాలి"..... కుంజ్రు కమిటీ నివేదిక, 1964.

పుస్తకాలలో చదివిన దానిని బయటి ప్రపంచంలో చూడటం వలన విద్యార్థికి మరింత అవగతమవుతుంది. అమెరికాలో స్కూల్ చదువుకు యూనివర్సిటీ చదువుకు మధ్య ఒక ఏడాది యాత్రలకు కేటాయిస్తారు. దాన్ని గ్యాప్ /రెస్ట్ ఇయర్ అని పిలుస్తారు. యూరప్ లోనూ, రష్యాలోనూ దేశాన్ని చూడటం విద్యలో ఒక భాగం. పాఠశాల స్థాయి నుండే పిల్లలకు ప్రపంచం ఎంత పెద్దదో చెప్పాలి. ప్రపంచాన్ని చూడటం వలన జీవితానుభవానికి అవసరమైన పరిజ్ఞానం లభిస్తుంది. యాత్రలు ఇందుకు దోహదపడతాయి.

శతాబ్దం కిందటే వివేకానందుడు ప్రపంచాన్ని రెండు సార్లు చుట్టేశాడు. యాత్రల వలన వివిద ప్రాంతాల వేష భాషలు, వాతావరణం, ఇతరులతో సర్దుబాటు, ప్రయాణ రక్షణ ఏర్పాట్లు, స్వతంత్రత వంటివి విద్యార్థులు నేర్చుకుంటారు.ఈ తరం పిల్లలు మరో రాష్ట్రంలోనో, మరో దేశంలోనో కూడా పని చెయ్యడానికి సిద్దంగా ఉండాలి. మనిషి జీవితం కూడా యాత్ర వంటిదే. ఏ యాత్రకు వారి పాఠశాల నుంచి తీసుకెళ్లకపోయినా, తల్లిదండ్రులతో వెళ్లిన ఊరు గురించి, చూసిన గుడి..చారిత్రక ప్రదేశం.. చుట్టాల ఇంట్లో ఏదైనా ఫంక్షన్ కి వెళ్లినా, ఏ ఊరైనా పండగలకు వెళ్లినా..అదీ యాత్రగా చేసుకుని కొత్త విషయాలు పిల్లలు తెలుసుకోవచ్చు..

## యాత్రలు-జాగ్రత్తలు

1. యాత్ర 5 రోజులకు మించకుండా చూసుకోవాలి. ఒకే రాష్ట్రంలోని లేదా ఒకే రూట్ లోని దర్శనీయ స్థలాలను ఎంపిక చెయ్యాలి.
2. ప్రయాణం, వసతి, భోజనాలు బాగుండాలంటే మంచి ట్రావెల్ కంపెనీకి ఇవ్వడం మేలు.
3. ఏ రోజు ఎక్కడ ఉంటామో, ఎక్కడ బస చేస్తామో, ఏమి చూస్తామో, దిన చర్య వివరిస్తూ పిల్లలకు నోటీసు పంపాలి.
4. చూడబోయే ప్రదేశాల వాతావరణానికి అనుగుణమైన దుస్తులు,ఏర్పాట్లు ముందే పిల్లలకు చెప్పాలి.
5. పిల్లల దగ్గర విలువైన ఆభరణాలు, వస్తువులు ఉండకుండా చూడాలి. డబ్బులు వారి ఇంచార్జ్ టీచర్ కు ఇచ్చేలా చూడాలి.
6. టూర్ నిర్వహణ బాధ్యతలు పిల్లల వారిగా టీచర్లకు పంచాలి. వాళ్ళ విద్యార్థుల లిస్ట్ వారికే ఇవ్వాలి. విద్యార్థులందరికి టీచర్ ఫోన్ నెంబర్ గుర్తుంచుకోమని చెప్పాలి.
7. బస్సులో, ట్రైన్లో ప్రయాణించేటపుడు ఒకసారి కూర్చున్న సీట్లోనే ఎప్పటికీ కూర్చునేలా చూడాలి. అలా అయితే ఎవరు లేరో తెలుస్తుంది.
8. విద్యార్థుల లిస్ట్, విద్యాసంస్థ లెటర్ ప్యాడ్, స్టాంప్ వంటివి దగ్గర పెట్టుకోవాలి. విద్యార్థుల లిస్ట్ జిరాక్స్ సెట్లు పెట్టుకోవాలి.
9. ఒక టార్చ్లైట్,ఒక మెడికల్ కిట్, నిర్వాహకునికి నావిగేషన్ ఉన్న మొబైల్ ఉండాలి.


10. ప్రయాణపు టికెట్లు రెండు కాపీలు పెట్టుకోవాలి. అవసరమైన గుర్తింపు కార్డులు అందుబాటులో ఉంచుకోవాలి.
11. టూర్లో సేఫ్టీకి ప్రాధాన్యం ఇవ్వాలి. నీరు, కొండలు, ఎలివేటర్లు, ఎస్కలేటర్ల దగ్గర చాలా జాగ్రత్తగా ఉండాలి. షాపింగ్ కూడా టీచర్ల పర్యవేక్షణలో జరగాలి.
12. దర్శనీయ స్థలాల వద్ద విధిగా గైడ్ ను పెట్టుకోవాలి. అప్పుడే ప్రదేశాల ప్రాముఖ్యత తెలుస్తుంది.
13. యాత్ర జరిగిన తీరు, విశేషాలతో టూర్ డైరీ రాయమని పిల్లలకు చెప్పాలి.
14. ఫోటోలు,వీడియోలు ముఖ్యమైన ప్రదేశాలకు పరిమితం చేయాలి. గ్రూపు ఫోటోలు మేలు. సమయం ఆదా అవుతుంది.
15. ఒక వేళ పిల్లలు తప్పిపోతే ఏం చెయ్యాలో పిల్లలకు ముందే చెప్పాలి. ఉదాహరణకు అక్కడే ఉండమని చెప్పడం, టీచర్ కు ఫోన్ చెయ్యడం, బస చేసిన హోటల్ పేరు గుర్తుంచుకోవడం ఉపయోగపడతాయి.

యాత్ర సమయం అంతా నిరంతర పర్యవేక్షణ అవసరం. నిర్లక్ష్యం ప్రమాద హేతువు. యాత్ర అనేది పిల్లలకు జీవితకాలపు జ్ఞాపకం. అయితే అది సురక్షితం, మంచి జ్ఞాపకం కావాలి.

## టూర్ డైరీ

యాత్రా విశేషాలన్నింటికి అక్షర రూపం ఇవ్వడమే టూర్ డైరీ. అయితే దీన్ని పిల్లలతో రాయించడం మంచిది. దీని వలన వాళ్ళు నివేదిక రాయడం నేర్చుకుంటారు. టూర్ మొదలవడానికి ముందే పిల్లలతో మీటింగ్ పెట్టి టూర్ జాగ్రత్తలు చెప్పడంతోపాటు యాత్ర అనుభవాలను, దినచర్యగా రాయమని చెప్పాలి. బాగా రాస్తే స్కూల్ మ్యాగజైన్ లో వేస్తామని లేదా దినపత్రికకు ప్రచురణకు పంపుతామని చెప్పాలి. ఈ పనిని ఒక లాంగ్వేజీ టీచర్ పర్యవేక్షించాలి. ఈ క్రింది అంశాలు టూర్ డైరీలో ఉండేలా చూడండి.

1. యాత్ర మొదలైన/పూర్తి అయిన సమయం, ఏ రోజున ఏ ప్రదేశంలో ఉన్నారు, ఎక్కడ బస చేశారు.
2. ప్రయాణపు విశేషాలు. ఎలా వెళ్లారు, ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి ఎంత దూరం ప్రయాణించారు, ఎన్ని రాష్ట్రాలు దాటారు, ఘాట్ రోడ్డు, అడవి గుండా ప్రయాణం వంటి వివరాలు.
3. భౌగోళిక వివరాలు. దర్శనీయ స్థలం ఏ అడవిలో ఉంది, ఏ కొండలో, ఏ పర్వత పంక్తులలో ఉంది.
4. చారిత్రక వివరాలు. ఆ స్థలం/కట్టడం ఎవరి కాలంలోనిది, వారిది ఏ వంశం, ఏ సామ్రాజ్యం.
5. ఎత్తైన ప్రదేశాలయితే అవి సముద్ర మట్టానికి ఎంత ఎత్తులో ఉన్నాయి, వాటి ప్రాముఖ్యత ఏమిటి.
6. గుళ్ళు గోపురాలు అయితే ఏ విశేష ప్రతిమ/రూపం, ఎప్పుడు ఉత్సవాలు జరుగుతాయి, విశేషం ఏమిటి.
7. దాటిన నదులు/వంతెనలు, చూసిన సముద్రం వాటి వివరణలు.
8. కలిసిన ప్రముఖుల వివరాలు/ ప్రయాణంలో ఎదురైన సంఘటనలు, వింతలు, ఆటంకాలు.
9. యాత్రలో చూసిన వ్యవసాయ పంటలు/చెట్లు/ జంతువులు/పక్షుల వివరములు.
10. పర్యటించిన ప్రదేశపు వాతావరణం, అక్కడ లభించే వస్తువులు/పదార్థాలు/ భోజన విశేషాలు
11. దేనిని ఎంతకు కొన్నారు, యాత్రలో పెట్టిన ఖర్చు వివరాలు.
12. యాత్ర సమయంలో జరిగిన ప్రముఖ రాజకీయ, ఆర్థిక సంఘటనలు/ప్రకృతి విలయాలు



ఇందు కోసం పర్యాటక ప్రదేశాలలో మనకు సమాచారం లభిస్తుంది. గైడ్ సహాయం తీసుకోవచ్చు. మరింత సమాచారం కోసం ఇంటర్ నెట్ లో చూడవచ్చు. డైరీ పరిపూర్ణం చేసే ఫోటోలను జత చెయ్యవచ్చు. కొన్ని వీడియోలను తీసుకోవచ్చు.

మార్కోపోలో, హుయాన్త్సాంగ్, ఫాహియాన్ వంటి వారు రాసినవి టూర్ డైరీలే! చేగువేరా వీటినే మోటార్ సైకిల్ డైరీ పేరున రాశాడు. తెలుగులో ఏనుగుల వీరా స్వామి "కాశీ యాత్ర" ఇలాంటిదే. సాహిత్యంలో యాత్రా సాహిత్యం ఉంటుందని పిల్లలకు చెప్పాలి. యాత్రలు చేయడం వలన జ్ఞానం, విజ్ఞానం పెరుగుతుంది, వాటి గురించి రాయడం వలన వ్యక్తీకరణ సామర్థ్యం పెరుగుతుంది.



– డా. పుల్లూరి సంపత్ రావు
విద్యావేత్త
9849396168

**పిల్లలూ! మీరు చేసిన యాత్రానుభూతి, ఫోటోలు మాకు పంపండి.. బాగున్నవి ప్రచురిస్తాం..**
వాట్సాప్ నంబర్: 87126 52298
manabadimagazine@gmail.com

# విద్య, ఆట, పాటలు ముద్దు..
# డ్రగ్స్ వద్దు.. బ్రో




**మొ**దట సరదాగా ఒక్కసారి తీసుకుంటే ఏమవుతుందిలే అనుకుని మొదలుపెడతారు. కానీ మత్తు పదార్థం లక్షణమే అది కాబట్టి మళ్లీ మళ్లీ తీసుకోవాలనిపిస్తుంది. దాంతో తీసుకునే సందర్భాలు పెరుగుతాయి. కొన్నాళ్లకి ఆ మోతాదు అలవాటైపోయి, తృప్తి కలగక ఇంకా ఇంకా ఎక్కువ తీసుకుంటూ ఉంటారు. అప్పటికి అది వ్యసనం స్థాయికి వెళ్లిపోతుంది. జన్యుపరమైన కారణాలు కూడా ఈ వ్యసనానికి దారితీస్తాయి. డిప్రెషన్, అటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టివిటీ డిజార్డర్ (ADHD) లాంటి మానసిక సమస్యలు ఉన్నవారిలోనూ వ్యసనాల రిస్క్ ఎక్కువ.

## పిల్లల్లో డ్రగ్స్ వ్యసనం ఇలా గుర్తించవచ్చు...

★ డ్రగ్ తీసుకున్నాక వేరే ఏ ఆలోచనా రాదు. ఏ పని చేయాలన్నా ఉత్సాహం ఉండదు. ఒకలాంటి మత్తులో ఉండిపోతారు. తిండి సరిగా తినరు, తింటే వాంతులవుతాయి. బరువు తగ్గిపోతారు.

★ తమ మీద శ్రద్ధ ఉండదు. శుభ్రంగా తయారవ్వరు. అన్నిటిలోనూ విపరీతమైన నిర్లక్ష్యం కన్పిస్తూ ఉంటుంది.

★ అతిగా నిద్రపోతారు. కళ్లు ఎర్రబడతాయి. కొన్ని రకాల డ్రగ్స్ కి నోరు పొడిబారుతుంది.

★ చీటికీ మాటికీ చిరాకు పడుతుంటారు. ఎవరితోనూ మాట్లాడరు. తమ గదిలోకి ఎవరినీ రానివ్వరు.

★ ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతారు. స్కూలుకి, కాలేజీకి వెళ్లరు. బాధ్యతారహితంగా కనిపిస్తారు.

★ మాటకీ చేతకీ మధ్య సమన్వయం ఉండదు. దేనికీ త్వరగా స్పందించరు. జ్ఞాపకశక్తి తగ్గుతుంది. బీపీ, గుండె కొట్టుకునే వేగం పెరుగుతాయి.

★ కొన్నిటివల్ల అతి చురుకుదనం, దుందుడుకుతనం వస్తాయి. కళ్లు విప్పార్చి చూస్తుంటారు. నిద్ర పోరు. ఎక్కువగా మాట్లాడతారు.

★ వీటిల్లో ఏ కొన్ని లక్షణాలు కన్పించినా వైద్యుల్ని సంప్రదించాలి.

## పెద్దలకు కౌన్సెలింగ్

డ్రగ్ ఎడిక్షన్ అనేది ఒక జబ్బు. డ్రగ్స్ కి అలవాటుపడినవారిని రోగిలా చూడాలి కానీ నేరస్తుల్లా కాదు. ఆ జబ్బు నయమవ్వాలంటే కుటుంబసభ్యుల తోడ్పాటుతో పాటు చికిత్స తప్పనిసరి. అందుకే వైద్యులు ముందు కుటుంబ సభ్యులందరికీ కౌన్సెలింగ్ ఇస్తారు. పిల్లలతో ఎలా ప్రవర్తించాలో చెబుతారు.

## ప్రభావం – ప్రమాదం

డ్రగ్స్ ప్రభావం నేరుగా మెదడు మీద పడుతుంది. చిన్నవయసులో డ్రగ్స్ తీసుకుంటే ఆ ప్రభావం ఎదిగే మెదడు మీద తీవ్రంగా ఉంటుంది. కొకైన్ లాంటివీ, పొగరూపంలోనూ ఇంజెక్షన్ రూపంలోనూ తీసుకునేవీ వేగంగా వ్యసనానికి దారితీస్తాయి.

మతి చలించినట్లు, బయటి ప్రపంచంతో సంబంధం లేనట్లు ప్రవర్తించడానికి దారితీస్తాయి. ఫిట్స్ వస్తాయి. అధిక మోతాదులో తీసుకుంటే మరణం కూడా సంభవించవచ్చు.

★ జీహెచ్‌బీ లాంటి రిక్రియేషనల్ డ్రగ్స్ వల్ల జ్ఞాపకశక్తి పోతుంది. ఆల్కహాల్‌తో పాటు తీసుకుంటే ఫిట్స్ ఎక్కువై కోమాలోకి వెళ్లే ప్రమాదమూ ఉంది.

★ హెరాయిన్‌కి అలవాటుపడితే గుండె, ఊపిరితిత్తులూ దెబ్బతింటాయి. మరికొన్నిటి వల్ల మూత్రపిండాలూ కాలేయమూ చెడిపోతాయి.

★ ఇంజెక్షన్ల వల్ల హెచ్‌ఐవీ లాంటి అంటు వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది.

★ మత్తు ప్రభావంలో ప్రమాదాలకు గురవుతారు.

★ ఆత్మహత్య ఆలోచనలు వస్తాయి.

★ మత్తు వ్యసనంతో నేరాలకు పాల్పడతారు.

## పిల్లల్లో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల వ్యసనాన్ని నిరోధించడంలో తల్లిదండ్రుల పాత్ర

పిల్లలు తల్లిదండ్రులతో ప్రతి విషయాన్ని మాట్లాడే వాతావరణం ఉండాలి.

పిల్లలకు అవగాహన కల్పించి, వారితో స్నేహంగా ఉండాలి

పిల్లలు మీతో సులువుగా మాట్లాడగలిగేలా తల్లిదండ్రులు అనునయంగా ప్రవర్తించాలి

డ్రగ్స్ ముప్పు గురించి, పర్యవసానాల గురించి నీతి కథలు, వాస్తవ సంఘటనలను వారికి అర్థమయ్యేలా చెప్పండి

తల్లిదండ్రులు పిల్లల మధ్య సంబంధాలు క్రమం తప్పకుండా ఆసక్తిగా ఉండేలా చూసుకోవాలి

పిల్లల రోజువారీ కార్యకలాపాలపై నిఘా ఉంచండి.

దినచర్యలో ఏదైనా మార్పు గమనిస్తే, పరిశీలిస్తూ ఉండండి

రోజువారీ పనులు, అకడమిక్, అదనపు పాఠ్య కార్యకలాపాలు, ఆహారం, ఆటలు, నిద్ర సమయాల కోసం షెడ్యూల్ అలవాటు చేయండి




## పిల్లలను పర్యవేక్షించడం ముఖ్యం

ఆరోగ్యకరమైన కార్యకలాపాలు, అభిరుచులను ప్రోత్సహించండి..

చిన్న చిన్న పనులు చేయించి అభినందించండి, చిరుబహుమతులు ఇవ్వండి

పిల్లలను ఆటపాటల్లో క్రియాశీలకంగా పాల్గొనేలా ప్రోత్సహించండి

ప్రవర్తనలో మార్పులను ముందుగానే గుర్తించండి

ఇంట్లో ప్రశాంతమైన వాతావరణాన్ని సృష్టించుకోండి.

తల్లిదండ్రుల పోట్లాటలు, నిత్యం ఇంట్లో గొడవలు ఉంటే పిల్లలు మత్తుపదార్థాల వైపు వెళ్లే ప్రమాదం ఎక్కువ.

తల్లిదండ్రులు సమయానుకూలంగా తినడం, నిద్రపోవడం, వ్యాయామం చేయడం, ఇంట్లో మద్యపానానికి దూరంగా ఉండటం, రోజువారీ కుటుంబంతో గడపడం ఆరోగ్యకరమైన ప్రవర్తన వల్ల పిల్లలకు ఆదర్శంగా నిలుస్తారు.

ఒకవేళ పిల్లలు డ్రగ్స్ వాడుతున్నట్లు గుర్తిస్తే, పిల్లలను తిట్టకుండా, కొట్టకుండా ఉండటం మంచిది. మంచిగా మాట్లాడుతూ మానసిక వైద్యుని నుండి కౌన్సిలింగ్ సలహాలు తీసుకోవాలి



– డా. ఎన్.ఎన్. రాజు,
అఖిల భారత మానసిక వైద్యుల సంఘం పూర్వ అధ్యక్షులు
9849111505

# విద్యార్థి లోకానికి నైతిక విలువలు అందించడం చాలా గొప్ప బాధ్యత

ఇన్ హౌస్



## ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు నైతిక విలువల ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు

ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు గారిని కేబినెట్ ర్యాంక్‌తో విద్యార్థులు నైతిక విలువల ప్రభుత్వ సలహాదారుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన నేపథ్యంలో 15.11.24న కాకినాడలోని చాగంటి వారి నివాసానికి ప్రభుత్వం తరపున ప్రతినిధిగా వెళ్లిన సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు IAS గారు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. విద్యార్థుల నైతిక విలువల ప్రభుత్వ సలహాదారుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించినందుకు చాలా ఆనందంగా ఉందని, విద్యాశాఖతో భాగస్వామ్యం అవుతూ, విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు నేర్పించే గొప్ప బాధ్యత ఎంతో శ్రేష్ఠమైనది అని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారు పేర్కొన్నారు.

## జోనల్ స్థాయి స్కూల్ బ్యాండ్ పైప్ బ్రాండ్ పోటీల్లో ఏపీకి రెండు స్థానాలు

కర్ణాటక రాష్ట్రం దావణగెరెలో ఇటీవల జరిగిన జోనల్ స్థాయి స్కూల్ బ్యాండ్ పైప్ బ్రాండ్ బాలుర విభాగంలో తాడేపల్లి గూడెం డా. బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు ప్రథమ స్థానం దక్కింది. బాలికల విభాగంలో కర్నూలు జిల్లా మాంటిస్సోరి ఇండస్ స్కూలు ద్వితీయ స్థానంలో నిలిచింది. తాడేపల్లి గూడెం పైప్ బ్యాండ్ బాలుర బృందం జాతీయ స్థాయి పాఠశాల బ్యాండ్ పోటీలకు అర్హత సాధించారు. విజేతలకు పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్ IAS, పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు. వి IAS., సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావుIAS అభినందనలు తెలిపారు.



## సోషల్ ఆడిట్ నిష్పాక్షికంగా జరగాలి

**రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమంలో సమగ్ర శిక్షా పథక రాష్ట్ర సంచాలకులు బి. శ్రీనివాసరావు**

సోషల్ ఆడిట్ నిష్పాక్షికంగా జరగాలని ,అన్ని అవకతవకలను నిలువరించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలి అని సమగ్ర శిక్షా పథక రాష్ట్ర సంచాలకులు బి. శ్రీనివాసరావు దిశానిర్దేశం చేశారు. పాఠశాల విద్య– సమగ్ర శిక్షా ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్‌పై సమగ్ర శిక్ష కార్యాలయంలో 30.11.2024న రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ ప్రారంభం సందర్భంగా ఎస్పిడి శ్రీనివాసరావు మాట్లాడారు. సామాజిక సమీక్షల దృష్ట్యా పాఠశాల విద్యా పథకాల సమగ్ర సమీక్ష, నిష్పాక్షిక ఆచరణ, పాఠశాలల పనితీరును మెరుగుపరిచే లక్ష్యంతో APSSAAT మాస్టర్ ట్రైనర్స్ కు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 52 మంది మాస్టర్ ట్రైనర్స్, ముగ్గురు రాష్ట్ర పరిశీలకులు పాల్గొన్నారు. న్యూ ఢిల్లీ NCERT నుంచి ప్రొఫెసర్లు ముఖ్య అతిథులుగా పాల్గొని శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సమగ్ర శిక్షా అడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్–2 కె. రవీంద్రనాథ్ రెడ్డి నిర్వహించగా, ఏఎస్పీడీ ప్రసన్న కుమార్, మధ్యాహ్న భోజన పథకం జాయింట్ డైరెక్టర్ గంగా భవాని, APSSAAT ప్రోగ్రామ్ మేనేజర్ సునీల్, ఇతర విద్యా అధికారులు పాల్గొన్నారు.






# పాఠశాలలను సందర్శించిన ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు

కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలోని శ్రీ అన్నే సీతారామయ్య జడ్పీ హైస్కూల్ (పీఎం శ్రీ ), దావాజీగూడెంలో మోడల్ ఫౌండేషన్ స్కూళ్లను19.11.24న సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి. శ్రీనివాసరావు IAS ఆధ్వర్యంలో వరల్డ్ బ్యాంకు ప్రతినిధుల బృందం సందర్శించింది. పాఠశాలలో విద్యా విధానాలు, విద్యార్థుల అభ్యాస పద్ధతులు, సృజనాత్మకత, విద్యా ప్రమాణాలను స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలను సమీక్షించారు. అనంతరం విద్యార్థులతో మమేకమయ్యారు. తరగతి గదులను సందర్శించి, ఉపాధ్యాయుల బోధన పద్ధతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గన్నవరం మండలం దావాజీగూడెంలో మోడల్ ఫౌండేషన్ స్కూల్ సందర్శించారు.

## ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు వీరే

ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు క్రిస్టెల్ (ఆర్థికవేత్త, టాస్క్ టీమ్ లీడర్), కీకోఇనొాయు (దక్షిణ ఆసియా ప్రతినిధి), జుంకోఒనిషి (లీడ్ సోషియల్ ప్రొటెక్షన్ స్పెషలిస్ట్, హ్యూమన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ లీడర్, ఇండియా), డి. హెచ్. సి. అటూరుపనే (లీడ్ ఆర్థికవేత్త), కార్తీక్ పెంటల్ (సీనియర్ ఎడ్యుకేషన్ స్పెషలిస్ట్), ట్రేసీవిలిచ్కోవ్స్కి, దీపా బాలకృష్ణన్ (సీనియర్ పర్యావరణ స్పెషలిస్ట్), తనుజ్మథూర్ (సీనియర్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్), ప్రియాంకా సాహూ (కన్సల్టెంట్ ), మన బడి మన భవిష్యత్తు జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం, శామో అడిషనల్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎం.వి. కృష్ణారెడ్డి, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎండీ దివాన్ రెడ్డి, కృష్ణా జిల్లా డీఈవో రామారావు, సత్త్వా కైవల్య, టీచ్ టూల్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.















## ధర్మ స్నేహం (కథ)

పోలకల్ గ్రామం దగ్గర ఒక అడవిలో రామ చిలుక, పావురం చాలా మంచి స్నేహితులుగా ఉండేవి. ఆ రెండు ఎక్కడికైనా కలిసే వెళ్లేవి. ఒకరోజు బయటకు వెళ్లాలనుకున్నాయి. కానీ పావురం వాళ్ళ అమ్మ 'వద్దు' అని చెప్పింది.

"బయటకు ఎందుకు వద్దమ్మా" అని చిన్న పావురం అడిగింది.

"ఎందుకంటే బయట ఎండలు చాలా ఎక్కువగా ఉన్నాయి. గద్దలు తిరుగుతున్నాయి. ప్రమాదం ఉంది" అని చెప్పింది. అమ్మ మాట కాదనలేక పోయింది.

అప్పుడే పావురం ఇంటికి రామచిలుక వచ్చింది. అప్పుడు రామచిలుక మనసులో ఇలా అనుకుంది. పావురానికి స్నేహం చేయడం, నాతో రావడం ఇష్టం లేదు. అందుకే వాళ్ళ అమ్మ మీదికి చెప్పింది. అలా రామచిలుక పావురాన్ని అపార్థం చేసుకుంది.

ఒకరోజు పావురం రామచిలుక ఇంటికి వచ్చింది. "రామచిలుక నువ్వు ఎందుకు నాతో మాట్లాడటం లేదు" అని అడిగింది.

రామచిలుక సమాధానం చెప్పకుండా తలుపులు వేసింది. ఒకరోజు రామచిలుక వాళ్ళ అమ్మ నాన్న "ఊరికి వెళ్దాం రా' అని పిలిచారు రామచిలుకని.



"లేదమ్మా.. నేను రావడం కుదరదు. మీరే వెళ్ళండి" అని చెప్పింది రామచిలుక.

ఆ తరవాత రామచిలుకకి జ్వరం వచ్చింది. ఆ విషయం పావురానికి తెలిసింది. అప్పుడు పావురం వాళ్ళ అమ్మ దగ్గరికి వెళ్లి "అమ్మా.. అమ్మా.. నా స్నేహితురాలికి జ్వరం వచ్చింది అంట. నేను నా స్నేహితురాలు ఇంటికి వెళ్తాను. తనకు జ్వరం తగ్గాక ఇంటికి వస్తానమ్మా" అని చెప్పింది.



పావురం వాళ్ళ అమ్మ "సరే అయితే వెళ్ళు" అని చెప్పింది.

చిన్న పావురం ఒక డాక్టర్ ని తీసుకొని రామచిలుక ఇంటికి పోయింది. పావురం చేసిన సహాయాన్ని చూసి నేను అనవసరంగా అపార్థం చేసుకున్నాను అనుకుంది. రామచిలుక. పావురాన్ని క్షమాపణ అడిగింది.

"రామచిలుక మనలో మనకు ఎందుకు క్షమాపణ" అని అంది పావురం.

మునుపటిలాగే కలిసిమెలిసి ఉందామని చెప్పింది పావురం. అప్పటినుండి రామచిలుక పావురం చాలా సంతోషంగా జీవించసాగాయి.

– **సి. శిరీష**, పదవ తరగతి,
Z.P.H.S, పోలకల్ గ్రామం, సి.బెళగల్ మండలం, కర్నూలు జిల్లా,

## నిప్పు కణిక

ప్రతి కదలికలో గర్జన నిలువెత్తు నినాదమవ్వాలి

ఊపిరి బిగబట్టి ప్రాణం పోయేంతవరకూ పోరాడుతా!

రాజకీయ నాయకుల తరపునో, లంచగొండుల తరపునో కాదు

నాకు నేను ప్రతీకగా నిలిచి పోరాడుతా!

స్వేద బిందువులనే అశ్రువులుగా భావించి,

భారాన్నంతా దించేసుకుంటున్న అమ్మ గుణం తరపున పోరాడుతా!

చిన్నారి కళ్ళల్లో రేపటి ఉదయపు స్వేచ్ఛా కిరణాల కోసం పోరాడుతా!

మగాడికి గొడుగులెత్తి అలసిపోయిన స్త్రీ మూర్తి తరపునా,

ఓణీలలో సిగ్గుతో బంధించబడి, భయంతో కాపురం చేసే బాలికల తరపున పోరాడుతా!

ఆడపిల్లి కాలి అందెలలో రాసలీలలు విని

అఘాయిత్యానికి పాల్పడే కామాంధుల కుత్తుకకు

ఉరి బిగిసే రోజు కోసం పోరాడుతూ !

బంధాన్ని, బంధనాన్ని తెంచుకొని

కాలం నుండి ఆవిర్భవిస్తా!

కాలంతోనే సమరం చేస్తా

కళ్ళలోని వేడి చెమ్మ కన్నీరుగా మారే లోపే

కటిక చీకటిని నిప్పు కణికనై కాల్చి బూడిద చేస్తా!!

– **విసరపు ప్రణీత**, పదో తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
సీతానగరం, అనకాపల్లి జిల్లా

# బొమ్మ గీశానోచ్!






**బత్తుల కావేరి,** 10వ తరగతి
వసంత ZPHS ఐతవరం,
నందిగామ మండలం, ఎన్టీఆర్ జిల్లా





**పి హర్షిత** 5వ తరగతి
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,
యరబాడు, నరసన్నపేట మండలం
శ్రీకాకుళం జిల్లా





**ఎస్. శశికుమార్,**
5వ తరగతి, మండల పరిషత్
ప్రాథమిక పాఠశాల, మేదరమెట్ల,
కొరిశపాడు, బాపట్ల జిల్లా

## రేపటి సమాజానికి వారధులు

బాలల్లారా..బడిఈడు పిల్లల్లారా..
భావి భారత పౌరుల్లారా..!

చదువు విలువ తెలుసుకోండి
చక్కంగా చదువుకోండి
ఉన్నతంగా ఎదగండి
ఉజ్వలంగా జీవించండి

చదువంటే జ్ఞాన సముపార్జనం
చదువంటే వ్యక్తి వికాసం
చదువుకుంటేనే పురోగమనం
చదువుతోనే సర్వం సాధ్యం

మంచిగా చదివితే
ప్రజ్ఞాపాటవాలు నేర్చితే
సంస్కార సౌజన్యవంతులౌతారు
జాతి ప్రగతికి మూలాలౌతారు

అంబేద్కర్, అబ్దుల్ కలామ్ లు
చదువుతోనే
విశ్వవిఖ్యాతులయ్యారు
వివేకానంద, సర్వేపల్లి
రాధాకృష్ణన్ లు
విద్యతోనే విశిష్ట
తత్వవేత్తలయ్యారు

క్రమం తప్పక బడికి వెళ్ళండి
క్రమశిక్షణతో మెలగండి
అమ్మానాన్నలను ఆరాధించండి
గురువులను పూజించండి

ఆటపాటల్లో పాల్గొనండి
ఆరోగ్యంగా జీవించండి
స్నేహితులతో సరదాగా గడపండి
బాల్యాన్ని ఆనందంగా
అనుభవించండి

బాలల్లారా..
ఎంచక్కా చదువుకుని
ఉన్నత శిఖరాలకు చేరుకోండి!
రేపటి సమాజానికి వారధులు
కండి!!

★★★

పి.వి.ప్రసాద్, విజయవాడ,
9440176824



## జెండానెత్తుదాం

★★★

రారా కృష్ణ త్రివర్ణ పతాకమెత్తుదాం
రారా రహీం బయ్య పాట పాడదాం
అబ్రహం ఆదాము కలసి నడుద్దాం
అందరం ఒక్కటై దేశభక్తి చాటుదాం

నిరంకుశ తెల్ల దొరల దౌర్జన్యాలు
స్వేచ్ఛ కొరకు యోధుల పోరాటాలు
అమర వీరుల త్యాగాలు చెప్పుదాం
గాంధీజీ ఆశయాలు తెలుపుదాం

నిరుపేదలైనా కలిమిగల వారైనా
హిందూ ముస్లీములైన క్రైస్తవులైనా
అందరమొక్కటై జెండానెత్తుదాం
ఐకమత్యాన్ని చాటిచెప్పుదాం

మనమంతా భరతమాత బిడ్డలం
మన జాతీయతను పెంచుదాం
ఆటలాడు పిల్లలైన పనిచేయు పెద్దలైన
ఆడ మగ భేదమన్నది లేకుండా
మనమంతా భారతీయులం
మూడు రంగుల జెండానెత్తుదాం
అమెరికా వెళ్ళినా ఆస్ట్రేలియా పోయినా
బ్రిటన్లో ఉన్నా విశ్వంలో ఎక్కడైనా
మన జాతీయ జెండా పాతుదాం
ప్రపంచానికి మన సత్తా చాటుదాం

**– ఆవుల చక్రపాణియాదవ్,**
తెలుగు ఉపాధ్యాయుడు, ప్రభుత్వ ఉన్నత
పాఠశాల (ఉర్దూ), కర్నూలు


# హృదయం లోంచి...

★★★

ప్రియమిత్రమా
చిన్ననాటి నేస్తమా..నా సుమధుర వర్తమానమా!
నేనంతా కలసి ఒకపువ్వునై
నీ పాదాల దగ్గర వినమ్రంగా ఒదిగిపోయి
కృతజ్ఞతలు చెప్పుకోవాలనిపిస్తోంది
. . .
ఎంత సుదీర్ఘ సహచర్యం మనది
ఎన్ని సంవత్సరాల సహవాసం మనది
ప్రతిరోజూ చూస్తున్నా
ఎప్పటికప్పుడు సౌశీల్యస్నేహపుష్పమై నీ చెంత పూస్తున్నా
నువ్వెప్పటికీ నాకు క్రొంగొత్త సౌందర్యానివే..
సూర్యోదయంలాగా పునరావృత సౌందర్యానివి!
. . .
నీ తెల్లదనం..నీ గుండ్రనితనం..నీ సౌకుమార్యం..
నా ప్రియమైన చాక్ పీసూ!
–నిన్ను చాక్ పీసని పిలిస్తే
మా ఇంగ్లీషుమాస్టారొప్పుకోడు–
'పీస్ ఆఫ్ చాక్' అనమంటాడు..
కానీ అంత పొడుగు పిలిచేంత దూరం మనమధ్యెక్కడిది
వ్యాకరణం ఒప్పుకోనియ్ ఒప్పుకోకపోనియ్ లే గానీ
నిన్ను చాక్పీసనే అంటాను

నా ప్రియమైన చాక్ పీసూ!ఐ లవ్ యూ!
నిండు హృదయంతో నిన్ను ప్రేమిస్తున్నాను
. . .
చిన్ననాడు నా గురువుల చేతిలో గువ్వపిట్టలా ఒదిగి
నన్ను మనిషిగా తీర్చేక్రమంలో పనిముట్టువయ్యావు
నేడు నేనూ ఒక గురువునయ్యాను
అలసటే లేదు నీకు
నా చేతిలోనూ ఒదిగి నా శిష్యులకోసం మరలా
పనిముట్టువవుతున్నావు
. . .
పని మొదలుపెట్టిన ప్రతిసారీ నిన్నునువ్వు తగ్గించుకుంటావు
క్లిష్టమైన అంశాలకు ఒక స్పష్టతనిచ్చేందుకు
నిన్ను నువ్వు విభజించుకుంటావు
ధూళివవుతావు దూసరితమవుతావు
దేహంలో ఆఖరి రేణువున్నంతవరకూ
శిలల్ని శిల్పాలుగా మార్చడంలో సాయపడుతూనే ఉంటావు
ఆఖరుకి ఆ ప్రయత్నంలోనే నశిస్తావు అంతలోనే తిరిగి జన్మిస్తావు
–నీకు ఎన్నెన్నో కృతజ్ఞతలు చెప్పుకుంటాను
నా ప్రియమైన చాక్ పీసూ!ఐ లవ్ యూ!
నిండు హృదయంతో నిన్ను ప్రేమిస్తున్నాను!!

**– రామిరెడ్డి రాఘవయ్య,**
హెడ్ మాస్టర్, ZPHS, ముటుకుల,
పుల్లలచెరువు మండలం, ప్రకాశం జిల్లా ,
9652902192




## పౌరనిర్మాణశాల! మా పాఠశాల!!

సీ. తల్లిదండ్రులరయ తరగతి గదిలోకి
రండి కాళ్ళనుమోప రండి మీరు!
పాఠశాలను జూడ, ప్రగతి పత్రముజూడ
ప్రభుత బడులుగాదె ప్రతిభ నిధులు!
కమిటీల పెద్దలు క్రమము తప్పకరోజు
బాగోగులను జూడ! బడికి రండి!
మాలోన తెలివిని లోలోన వెలిగించు
గురువులు గలగొప్ప కొలువు మాది!

తే.గీ. ఆటపాటల కేంద్రమై యమర యుండు
డొక్క సీతమ్మ భోజన జక్కదనము
తారలముమేము మెరుపుసందడుల హేల!
పౌరనిర్మాణశాల!మా పాఠశాల!!

*(మెగా పేరెంట్స్ మీటింగ్ సందర్భంగా వ్రాసిన పద్యం)*

**– కిలపర్తి దాలినాయుడు,**
*పాఠశాల సహాయకుడు(సోషల్), జిల్లా పరిషత్*
*ఉన్నత పాఠశాల, రామభద్రపురం,విజయనగరం జిల్లా*





# క్యాలెండర్ 2025


| జనవరి అక్టోబర్ | మే | అగస్టు | ఫిబ్రవరి మార్చి నవంబర్ | జూన్ | సెప్టెంబర్ డిశంబర్ | ఏప్రిల్ జూలై | తేదీలు | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| బు | గు | శు | శ | ఆ | సో | మ | 1 | 8 | 15 | 22 | 29 |
| గు | శు | శ | ఆ | సో | మ | బు | 2 | 9 | 16 | 23 | 30 |
| శు | శ | ఆ | సో | మ | బు | గు | 3 | 10 | 17 | 24 | 31 |
| శ | ఆ | సో | మ | బు | గు | శు | 4 | 11 | 18 | 25 | |
| ఆ | సో | మ | బు | గు | శు | శ | 5 | 12 | 19 | 26 | |
| సో | మ | బు | గు | శు | శ | ఆ | 6 | 13 | 20 | 27 | |
| మ | బు | గు | శు | శ | ఆ | సో | 7 | 14 | 21 | 28 | |

**ఈ ఏడాదిలో ఏ తేదీ ఏ వారం పడుతుందో ఠక్కున చెప్పేయొచ్చు..**

**మీరూ ప్రయత్నించండి...**

రూపకల్పన:
**బండారు నారాయణస్వామి**, హెచ్ఎం,
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,
హావళిగి, విడపనకల్ మండలం,
అనంతపురం జిల్లా

## రంగులు వేయండి



## మ్యాజిక్ 2025

చిన్నారులూ!
మనం నూతన సంవత్సర 2025 లోకి వచ్చేసాం . ఒక చక్కటి మ్యాజిక్ స్క్వేర్ ద్వారా కొత్త సంవత్సరాన్ని స్వగతం పలుకుదాం..

| | | | |
|---|---|---|---|
| 504 | 498 | 509 | 504 |
| 508 | 505 | 513 | 499 |
| 502 | 507 | 500 | 516 |
| 501 | 515 | 503 | 506 |

### మ్యాజిక్ 2025

- పై చదరం లో ఏ నిలువు వరుసలో నాలుగు సంఖ్యల మొత్తమైనా 2025 ఏ అడ్డ వరుసలోని నాల్గు సంఖ్యల మొత్తమైనా 2025
- అదేవిధంగా రెండు కర్ణాలలో నాలుగు సంఖ్యల మొత్తం కూడా 2025.
- పైన చూపిన విధంగా ఎడమ 2X2. కుడి 2X2, ఎడమ (కింద) 2X2
- కుడి (కింద ) 2X2, మధ్య నున్న 2X2, చదరంలలో నాలుగు సంఖ్యలో మొత్తం 2025
- నాలుగు మూలలనున్న నాలుగు సంఖ్యల మొత్తం 2025
- ఇలా మరెన్నో ప్యాటర్న్ లో నాలుగు సంఖ్యల మొత్తం 2025 రావడం గమనించండి .

– **తోటకూర సాయిరామకృష్ణ**,
సామర్లకోట. 9440806669

## చుక్కలు కలపండి



### మీకు తెలుసా?

* ప్రపంచంలో తొలిసారిగా పేపర్ కరెన్సీ ముద్రించిన దేశం చైనా
* కాలుష్య కారకాలను పోషకాలుగా మార్చే బ్యాక్టిరీయా (సూడో మోనాస్, అసెటూ బ్యాక్టర్) ను ఐఐటీ బాంబే పరిశోధకులు గుర్తించారు.
* ప్రపంచంలో అతిపెద్ద సరస్సు 'బైకాల్'
* సౌర వ్యవస్థలోని అంగారక గ్రహాన్ని "రెడ్ ప్లానెట్" అని పిలుస్తారు
* మొక్కలు సూర్యరశ్మిని శక్తిగా మార్చే ప్రక్రియ కిరణజన్య సంయోగక్రియ
* అత్యంత వేడిగా ఉండే ఖండం ఆఫ్రికా.
* ఉరుములు, వర్షం పడేటప్పుడు వచ్చే భయాన్ని అంబ్రోఫోబియా అంటారు.
* అమెజాన్ రెయిన్‌ఫారెస్ట్ ను భూమి ఊపిరితిత్తుగా పరిగణిస్తారు.

(బాలల కథ)

# బాలల ఎత్తు – దొంగల చిత్తు

సింగుపురంలో రమాకాంత్ – సావిత్రి దంపతులు నివాసం ఉంటున్నారు. పదవీ విరమణ చేసిన రమాకాంత్ పట్టణ శివారు ప్రాంతంలో 80 ఏళ్లు వయసుగల తల్లి పార్వతమ్మ, ఐదారు తరగతులు చదువుతున్న సాయి, దీక్షిత్ తో కలిసి నివాసముంటున్నారు.

వేసవి సెలవులు కావడంతో రమాకాంత్ తమ్ముడి పిల్లలు పండు, చింటూ కూడా పెదనాన్న ఇంటికి వచ్చారు. సెల్ ఫోన్, ల్యాప్ టాప్ కంటే నాయనమ్మ చెప్పే కథలంటే నలుగురికి ఎంతో ఇష్టం.

పార్వతమ్మకి మనుమలు అంటే ఎంతో ప్రేమ, అభిమానం. పెద్ద బాలశిక్ష, సుమతి శతకం, భగవద్గీత శ్లోకాలు చక్కగా పిల్లలకు బోధించడంతోపాటు రాత్రి నిద్రపోయే ముందు మంచి నీతి కథలు, హాస్య కథలు చెప్పి మనుమలను నిద్రపుచ్చేది. నాయనమ్మతో పిల్లలకు ఏర్పడ్డ అనుబంధం చూసి రమాకాంత్ దంపతులు మురిసిపోయేవారు.

ఒక రోజు రమాకాంత్, సావిత్రి దంపతులు ఒక శుభకార్యం నిమిత్తం విశాఖ వెళ్లారు. 'ఒకరోజు రాత్రి అక్కడ ఉండి తెల్లవారేసరికి వచ్చేస్తామని' చెప్పి ఆ దంపతులు పార్వతమ్మ, పిల్లలకి జాగ్రత్తలు చెప్పి వెళ్లిపోయారు.

ఆరోజు ఆదివారం. అమావాస్య రాత్రి కావడంతో చీకటి పడక ముందే ఫలహారం కానిచ్చి తలుపులు, కిటికీలు, గేట్లు మూసివేసి నాయనమ్మతో పిల్లలు సరదాగా కాలక్షేపం చేశారు. రాత్రి పదిన్నర గంటల వరకు మంచి మంచి కథలు చెబుతూ పిల్లలతోపాటు నిద్రలోకి జారిపోయింది పార్వతమ్మ.

సరిగ్గా రాత్రి 12 గంటల సమయం. ధబీమని పెద్ద శబ్దం. తుళ్లిపడి లేచింది పార్వతమ్మ. మనసు ఏదో కీడు శంకించింది. ద్వారం పక్కనే కిటికీ మెల్లగా తెరిచి చూడగా నల్లని ముసుగులు వేసుకుని ఇద్దరు దొంగలు. బండరాయితో తలుపులను విరగ్గొడుతూ కనిపించారు. పార్వతమ్మకు ముచ్చెమటలు పట్టాయి. నోట మాట రావడం లేదు. ఏం చేయాలి భగవంతుడా? డబ్బూ దస్కం పోతే పోయింది. పిల్లలను కాపాడుకోవాలని భావించి వారిని తట్టి లేపింది. నలుగురు పిల్లలు లేచారు. పార్వతమ్మ దొంగల విషయం చెప్పడంతో పిల్లలు గజగజ వణికిపోయారు. సాయి, మిగతా పిల్లలను నాయనమ్మను హత్తుకుని ఆపద వచ్చినప్పుడు ఆలోచనతో ఎదుర్కోవాలని భావంతో పిల్లలు చెవిలో గుసగుసలాడాడు. చీరలో ఉన్న రాయి తలుపునకు తాకడంతో పెద్ద పెద్ద శబ్దాలు వస్తున్నాయి. ఇరుగుపొరుగు ఎవరూ లేకపోవడంతో దొంగలు ఈ పనికి పూనుకున్నారు. ఆ దెబ్బలకి లోపల ఉన్న గడియలు విరిగిపోయే పరిస్థితి ఏర్పడింది.

ఇదే సమయంలో నాయనమ్మతో మిగతా నలుగురు పిల్లలు పాతకాలంనాటి బోను పెట్టెను హాల్లోకి తెచ్చి తలుపునకు ఆనించి పెట్టారు. సాయి ఆదేశాల ప్రకారం నాయనమ్మ రోకలిబండ పట్టుకోగా, సాయి కారండబ్బా పట్టుకున్నాడు. దీక్షిత్ బాగా మరిగిన వేడినీటి ప్లాస్కుని పట్టుకుని సిద్ధమయ్యాడు. చింటూ ఫోన్ పట్టుకొని 100 కి కాల్ చేసి లొకేషన్ షేర్ చేసింది. ఇక పండు కత్తిపీట సిద్ధం చేసుకుని నిలబడింది. ఐదుగురు బోను పెట్టెను అనుకుని ఊపిరి బిగ పెట్టి తలుపు తెరుచుకోకుండా గట్టిగా ఒడిసి పట్టుకున్నారు.

అయినా ఆగంతకుల బలం ముందు చిన్నారులు, వృద్ధురాలు నిలవలేకపోయారు.

'అరేయ్ చంపేస్తాం.. తలుపు తెరవండి' అంటూ ఆగంతకులు కేకలు వేశారు. వారి బలమంతా ఉపయోగించి తలుపులు కొంతవరకు తెరిచినప్పటికీ బోను పెట్టె అడ్డుగా ఉండడంతో వారి పప్పులు ఉడకలేదు. కొద్దిగా తెరుచుకున్న తలుపు సందులో ఒక ఆగంతకుడు తలపెట్టి అరవడం మొదలుపెట్టగా సాయి శరవేగంతో కారం కళ్ళల్లో కొట్టాడు. 'అయ్యబాబోయ్ చచ్చానురా దేవుడా' అంటూ కేకలు వేశాడు ఓ దొంగ.

రెండో ఆగంతకుడు రెండు చేతులు ఉపయోగించి లోపలికి రావాలని ప్రయత్నించగా నాయనమ్మ రోకలిబండతో ఒకటిచ్చుకుంది. దీనితో బాధతో విలవిల్లాడు రెండో దొంగ. ఇంతలో చింటూ చేసిన ఫోన్ కాల్ కి స్పందించిన పోలీసులు రానే వచ్చారు. ఆగంతకులను పట్టుకున్న పోలీసులు విషయమంతా తెలుసుకొని పిల్లలతో పాటు నాయనమ్మను అభినందించారు. మీరు వేసిన ఎత్తుకు దొంగలు చిత్తయ్యారని అంతా పిల్లలను మెచ్చుకున్నారు.



– టంకాల సత్యంనాయుడు,
రాజాం
9395355952



# గిరి కుసుమాలు



మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, దిగువదేరువాడ, గుమ్మలక్ష్మీపురం మండలం, పార్వతీపురం మన్యం జిల్లా.







భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాల ప్రాముఖ్యతను తెలియజేసి, కళలను ప్రోత్సహించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్షా, రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ(SCERT) ఆధ్వర్యంలో విజయవాడ పట్టణ శివారు పోరంకిలోని మురళి రిసార్ట్స్ లో రాష్ట్ర స్థాయి **'కళా ఉత్సవ్'** మరియు **బాలరంగ్ పోటీలు** జరిగాయి.

స్కాన్ చేయండి.. ఫాలో అవ్వండి..
మన బడి మ్యాగజైన్ చదువుకోండి.

# రచనలకు ఆహ్వానం


**ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, రచయితలకు, తల్లిదండ్రులకు విజ్ఞప్తి...**

"పాఠశాల విద్యాశాఖ – సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో విద్యా, విషయక, విజ్ఞాన అంశాలతో వస్తున్న మాసపత్రిక **మన బడి** కోసం.. మీ నుంచి రచనలను ఆహ్వానిస్తున్నాం. పిల్లలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని అందించే రచనలు ఏవైనా, ఎవరైనా పంపవచ్చు. కథలు, వ్యాసాలు, కవితలు, గేయాలు, జోకులు, బొమ్మలు, కార్టూన్లు, అనువాద రచనలు, సృజనాత్మక బోధనా పద్ధతులు, విద్యార్థులు రూపొందించిన ఉత్తమ ప్రాజెక్టులు... ఇలా ఏ అంశాన్నయినా రాసి పంపండి. బాగున్నవాటిని ప్రచురిస్తాం. సొంత రచనలై ఉండాలి, ఎక్కడ ప్రచురితం కాకూడదు. మీ పేరు, ఫోన్ నంబరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జోడించండి. ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. ఎంపిక కాని రచనలు తిరిగి పంపబడవు. ప్రచురితమైన వాటిలో ఉత్తమ రచనలకు చక్కని బహుమతి ఇవ్వబడును. ఈ రచనా యజ్ఞంలో పిల్లలు, తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు ,రచయితలు భాగస్వాములవ్వాలని కోరుతున్నాం. ఇందులో రచయితల వెలిబుచ్చిన అభిప్రాయాలు పూర్తిగా వారి సొంతం. రచయితల అభిప్రాయాలతో సంపాదకులు, ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఏకీభవించాల్సిన పనిలేదు."

మీ రచనలు పంపాల్సిన చిరునామా:

## స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ & ఎడిటర్

సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయం, కేబీసీ బాయ్స్ హైస్కూల్ కాంపౌండ్,
పటమట, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్: 520 010,
వాట్సాప్ నంబర్: 87126 52298 manabadimagazine@gmail.com




Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed by : **M/s. Lakshmi Vignesh Printers,** Guntur